www.prajasakti.com
ప్రజాశక్తి
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం 17 నవంబర్ 2022



కేసుల విచారణలో అలసత్వం వీడాలి

పోలీస్ అధికారులకు డిఐజి సూచనలు

సమీక్షిస్తున్న డిఐజి

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లా వ్యాప్తంగా నమోదైన పోక్సో, ప్రాపర్టీ కేసులతోపాటు, రోడ్డు ప్రమాదాల సమయంలో నమోదు చేసిన కేసుల విచారణలో పోలీసులు ఎట్టిపరిస్థితుల్లో అలసత్వం వహించొద్దని గుంటూరు రేంజ్ ఐజి డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ఐపిఎస్ సూచించారు. బుధవారం నగర, రూరల్ పోలీసు అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సందర్భంగా పోలీసు అధికారులనుద్దేశించి డిఐజి ప్రతి కేసుపై లోతైన సమీక్ష నిర్వహించి, పలు సూచనలు చేసి, అలసత్వం లేకుండా దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. హైవేపై ప్రమాదాలను తగ్గించేందుకు అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో బ్లాక్ స్పాట్ లను గుర్తించి సంబంధిత అధికారుల సమన్వయంతో లైటింగ్, స్పీడ్ బ్రేకర్స్ వంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని అక్కడ సాధారణ స్థితి తీసుకురావాలి. హైవే పెట్రోలింగ్ వాహనాలను ముమ్మరం చేయాలన్నారు.ప్రాపర్టీ నేరాలను సమీక్షించి, నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీసి, పలు సూచనలు చేశారు. నేరం జరిగినట్లు సమాచారం వచ్చిన వెంటనే స్పందించాలని, మహిళలు, పిల్లలు, వృద్ధులపై జరిగే నేరాలను పూర్తిగా అరికట్టాలన్నారు.

ప్యాచ్‌వర్క్‌లకు పైసల్లేవ్..!

వైసిపి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి కార్యక్రమాలు మూలనపడ్డాయి. ప్రధానంగా రోడ్లు, డ్రెయినేజీ, వీధి దీపాలు, వంటి కనీస సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. సంక్షేమ పథకాలు పంపకాలు తప్ప, అభివృద్ధి విషయంలో నిధులేక, రాక ఎంఎల్‌ఎలే నిరుత్సాహంతో ఉన్నారు. గత ప్రభుత్వం హయాంలో పెద్ద ఎత్తున రోడ్లు, డ్రెయినేజీ పనులు చేశారు. అక్కడక్కడా ప్యాచ్ వర్కులు మూడేళ్ల నుంచి మూలనపడ్డాయి. ప్రస్తుతం కురుస్తోన్న వర్షాలకు చిన్నపాటి ప్రాంతం చిత్తడిచిత్తడిగా మారి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంది. భూగర్భ డ్రెయినేజీ పూర్తి కాకపోవడంతో నీరు రోడ్లపై ప్రవహిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయం ప్రజలను వెంటాడుతోంది.

- ముందుకురాని కాంట్రాక్టర్లు
- వర్షమొస్తే గందరగోళం
- రోడ్లపై డ్రెయినేజీ నీళ్లు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతి.నిధి

నెల్లూరు నగరం రాష్ట్రంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రభుత్వం చెబుతోంది. అందుకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం లేదు. వైసిపి అధికారంలోకి వచ్చాక నెల్లూరు నగరంలో అభివృద్ధి నామమాత్రంగా కనిపిస్తోంది. రోడ్లు, డ్రెయినేజీ, మంచినీరు, వీధి దీపాలు వేసుకునే పరిస్థితులు అధికారపార్టీ నేతలకు లేవు. కార్పొరేషన్ ఎన్నికల్లో 54 స్థానాలు గెలుచుకున్న వైసిపి, అభివృద్ధిలో మాత్రం పూర్తిగా వెనక బడింది. కార్పొరేటర్లు కనీసం వీధి దీపాలు వేయించి పరిస్థితుల్లో లేరు. కొందరు కార్పొరేటర్లు సొంత డబ్బుతో ఖర్చు చేస్తున్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో సుమారు రూ.5600 కోట్లు ఖర్చు చేసింది. సుమారు 650 కిలో మీటర్లు సిమెంట్ రోడ్లు, 650 కిలో మీటర్లు పైప్‌లైన్స్‌తోపాటు భూగర్భ డ్రెయినేజీ పనులు చేసింది. సుమారు రూ. 1150 కోట్లతో డ్రెయినేజీ పనులు చేపట్టి, 90 శాతం వరకు పనులు పూర్తి చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ఆ పనులు

మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ఇంటి పక్కన మూడేళ్లగా జరగని ప్యాచ్‌వర్కుతో బురదమయం

చేయకుండా కంపెనీ నిలిపేసి వెళ్ళి పోయింది. ఎక్కడ డ్రెయినేజీ అక్కడే ఉన్నాయి. వర్షం పడితే నెల్లూరు నగరం నదులను తలపిస్తుంది. ప్రధానంగా ట్రంకు రోడ్డు, కలెక్టరేట్, గాంధీబొమ్మ, చిన్న బజార్, పెద్ద బజార్‌తోపాటు అనేక ప్రాంతాలు డ్రెయినేజీ నీరు వెళ్లడానికి అవకాశం లేకుండా రోడ్లపై పారుతున్నాయి.

తూర్పు, పడమర నగరానికి రాకపోకలు కూడా దెబ్బతింటున్నాయి. ఆత్మకూరు బస్టాండ్, విజయమహల్ గేట్, రామలింగాపురం, మాగుంట లేఅవుట్‌ప్రాంతాల్లో అండర్ పాస్ బ్రిడ్జిలు న్నాయి. చిన్నపాటి వర్షం పడితే నీటితో ఇవి నిండి పోతున్నాయి. రాకపోకలు పూర్తిగా దెబ్బతింటున్నాయి.

ప్యాచ్ వర్కులకు పైసల్లేవ్

నెల్లూరు నగరంలో చేసిన పనులు మధ్యలో నిలిచిపోయినవి. ఇప్పటికి పూర్తి కాలేదు. ఏదో కారణంతో ఆగిన పనులు డబ్బులేక నిలిచిపోయాయి. సిమెంట్ రోడ్డు నిర్మాణం జరిగేసమయంలో జాతీయ రహదారి నుంచి పడారుపల్లి వచ్చే సిమెంట్ రోడ్డు స్థానికుల వివాదంలో అప్పుడు నిలిచిపోయింది. మూడన్నరేళ్ల నుంచి ఈ కొద్దిపాటి రోడ్డును నిర్మించే పరిస్థితి కనిపించడం లేదు. వర్షం వస్తే బురద మయంగా మారుతోంది. రిత్విక్

నెల్లూరు నగరంలో డ్రెయినేజీ నీరు రోడ్లపైనే..

వెన్సీ వద్ద ఉన్న ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు నివాసం పక్కన రోడ్డు నిర్మాణం జరగలేదు. ఇదే కాదు. నెల్లూరు నగరంలో నిలిచిన ప్రతి పని ముందుకు సాగడం లేదు. గుంతలు, బురదతో జనం నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంత ప్రజలు ప్యాచ్ వర్కుల గురించి మాట్లాడినా స్థానిక కార్పొరేటర్లు మౌనం వహిస్తున్నారు. అక్కడక్కడా కాంట్రాక్ట్ పిలిచినా పనులు చేయడానికి ఏ ఒక్క కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. డబ్బులు రాకపోవడంతో మేం చేయలేమని చెబుతున్నారు. ప్రభుత్వం పై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టిడ్కో గృహాల కేటాయింపు వేగవంతం

ప్రజాశక్తి-నెల్లూరు :నవరత్నాలు పథకంలో ప్రభుత్వం పేదలందరికీ గూళ్లు అందించే కార్యక్రమంలో భాగంగా నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు త్వరితగతిన కేటాయించాలని అధికారులను కమిషనర్ హరిత ఆదేశించారు. టిడ్కో గృహాలు, జగనన్న కాలనీల ప్రగతిపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని కమిషనర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలపై లబ్ధిదారులను ప్రోత్సాహం కలిగించే దిశగా కొన్ని కాలనీల్లో అందమైన మోడల్ గృహాలను నిర్మించి ప్రదర్శనకు ఉంచాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులతో బ్యాంకు ఖాతాలు తెరిపించి, గృహ రుణాలను వేగవంతంగా మంజూరు చేయించాలని ఆదేశించారు. మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర బాబు, నగర పాలక సంస్థ సెక్రటరి హేమావతి ఉన్నారు.

'ఎల్ఆర్ఎస్' గడువు పొడిగింపు

నెల్లూరు : లే అవుట్ రెగులేషన్ స్కీం (ఎల్.ఆర్.ఎస్) గడువును 2023వ సంవత్సరం జనవరి నెల 31వ తేదీ వరకు పొడిగించారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లే అవుట్ యజమానులకు నగర పాలక సంస్థ కమిషనర్ హరిత సూచించారు. నగర పాలక సంస్థ కార్యాలయం కౌన్సిల్ సమావేశ మందిరంలో సచివాలయ వార్డు ప్లానింగ్ రెగులేషన్ కార్యదర్శులతో సమీక్షను బుధవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబర్ 10ని అనుసరించి క్రమబద్ధీకరణకు అర్జీలు దఖలు చేసిన లే అవుట్ యజమానులు, లే అవుట్ కు సంభందించిన పూర్తి ధ్రువీకరణ పత్రాలను కార్యాలయంలో సమర్పించి అనుమతులు పొందాలని సూచించారు.

కాంట్రాక్టు విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు :జిల్లాలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల అపరిష్కృత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. బుధవారం విద్యుత్ భవన్‌లో ఎస్ఇ ఛాంబర్‌లో అధికారి వెంకటసుబ్బయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పిడిసిఎల్ కమిటీ కార్యదర్శి బొజ్జ సుమన్, ఆశోక్‌లు మాట్లాడుతూ జిల్లాలోని నాయుడుపేట డివిజన్‌లో 18, గూడూరు, కావలి డివిజన్‌లో 10, నెల్లూరు రూరల్ ప్రాంతంలో 5, నెల్లూరు నగర పరిధిలో, ఆత్మకూరు ప్రాంతంలో 7 సబ్‌స్టేషన్లలో కార్మికులకు వేతనాలు గడిచిన 9 నెలలుగా చెల్లించలేదన్నారు. విధి నిర్వహణ సమయంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే మరో వారం రోజుల తరువాత నిరసన కార్యక్రమం యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.

'రిచ్'లో మెచ్యూర్ డే వేడుకలు

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక పొగతోట ప్రాంతంలోని 'రిచ్' వైద్యశాలలో ముందస్తు వరల్డ్ ప్రిమెచ్యూర్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న రిచ్ వైద్యశాల చీఫ్ కన్సల్టెంట్, ఛైర్మన్ టి.రవికుమార్ బాలింతలనుద్దేశించి మాట్లాడారు. నవంబరు 17న వరల్డ్ ప్రీ మెచ్యూర్ డే నిర్వహించుకుంటామని,బిడ్డలకు జన్మనిచ్చిన తల్లులకు అవగాహన కల్పించేందుకు తమ వైద్యశాలలో ముందస్తు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యశాలలో నెలలు పూర్తిగా నిండని, ముందుగా జన్మనిచ్చిన తల్లుల బిడ్డలు ఆరోగ్యం వంతంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడం తోపాటు పలు సలహాలు, సూచనలు చేశారు. తమ

వైద్యశాలలో అత్యంత ఆధునిక వైద్యవిధానాలతో, నిపుణులైన డాక్టర్లతో పురిటి బిడ్డలకు వైద్యం అందిస్తు శిశు మరణాల సంఖ్యను తగ్గించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రీ మెచ్యూర్ బేబీలను తల్లులు ఏ విధంగా పెంచాలి, కంగారూ మదర్‌కేర్ గురించి, పాలు పట్టించే విధానం, బిడ్డను ఎలా శుభ్రం చేయాలి తదితర అన్ని విషయాలపై అవ గాహన కల్పిస్తామన్నారు. చివరగా బాలింతలకు బేబీ కిట్లను పంపిణీ చేశారు. డాక్టర్ హజరత్తయ్య, భాస్కర్,మధులిక పాల్గొన్నారు.

సామాజిక దృక్పథం అలవర్చుకోవాలి :డివైఎఫ్ఐ

నెల్లూరు : సింహపురి చిల్డ్రన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎంవి రమణ మాట్లాడుతూ నగరంలోని అనేక పాఠశాలలో విద్యార్థులు అనేక సమస్య ఎదుర్కొంటున్నారని విద్యార్థులకు మానసిక ఉల్లాసానికి దోహదపడే ఆటస్థలాలుగానే క్రీడా సామాగ్రిగానే పిల్లలకు అందట్లేదన్నారు. విద్యార్థులు మతం పట్ల కులాల పట్ల సరైన ఆహారం కలిగి ఉండాలని. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా విద్యార్థులు తమ నివాస ప్రాంతాలలో చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని కోరారు. ఆటల పోటీలల్లో గెలుపోవటములను సమానంగా స్వీకరించే వచ్చినతస్థాయి ఎదగాలని ఆకర్షించారు. స్కూల్ హెడ్మాస్టర్ లో తిరుమల రాజు రత్నం ఉపాధ్యాయులు డివైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

27న రజకుల ఆత్మీయ సదస్సు

ప్రజాశక్తి-నెల్లూరు :రజకులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కరించే విధంగా తగిన నిర్ణయాలు తీసుకునేందుకు ఈ నెల 27న రజకుల ఆత్మీయ సదస్సు జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య పేర్కొన్నారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో బుధవారం నేరెళ్ల శ్రీనివాసులు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ గడిచిన మూడేళ్లలో ఈ ప్రభుత్వం రజకుల అభివద్ధికి చేసింది ఏమీ లేదన్నారు. రజక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఛైర్మన్, 12 మంది డైరెక్టర్లని నియమించిన ప్రభుత్వం కార్పొరేషన్‌కి ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. రజక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నేరెళ్ల శ్రీనివాసులు, రేకులు గుంట అంకయ్య మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకం వత్తిదారులందరికీ ఇవ్వాలని జిల్లాలోని పట్టణ మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లో ఇల్లు లేని రజకులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి గట్టిల్లు కట్టి ఇవ్వాలన్నారు. వత్తిచేసేందుకు మోడ్రన్ దోబీ ఘాట్‌లు అధునాతనమైన యంత్రాలతోఏర్పాటు చేసి పని కల్పించాలని డిమాండ్ చేశారు. చివరగా రజక ఆత్మీయ సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. గోనెల సిద్ధయ్య. పందేటి సురేంద్ర, బ్రహ్మదేవి వేదవతి, బొప్పరాజు వెంకటేశ్వర్లు, గోనెల శ్రీనివాసులు, దేవరకొండ వెంకటేశ్వర్లు, సురభి శ్రీనివాసులు, కంచర్ల సాయి, కోమటిగుంట్ల కష్ణ పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

బివి రమణకు గరుడ పురస్కారం

ప్రజాశక్తి - కందుకూరు : కందుకూరుకు చెందిన ఉపాధ్యాయుడు బి.వి రమణకు గరుడ జాతీయ పురస్కారం అందజేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీలో నందమూరి తారక రామారావు కళామందిరంలో ఆదర్శ కళానిలయం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బివి రమణకు గరుడ జాతీయ పురస్కారం సిహెచ్ ప్రకాష్ ,డాక్టర్ అరుణ సుబ్బారావు ,నాగబాల సురేష్, భిక్ష నాయక్ ,టీవీ నటి మాధవరెడ్డి, కార్తీకరెడ్డి చేతుల మీదగా అందజేశారు. వివిధ సామాజిక కార్యక్రమాలు విద్యార్థులకు నైతిక విలువలు వివరించారు. పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించిన బివి రమణకు పురస్కారంతో సత్కరించారు. గరుడ జాతీయ పురస్కారం అందుకున్న బివి రమణను బంధువులు, స్నేహితులు ,పాఠశాల సిబ్బంది అభినందించారు.

పారిశుధ్య సమస్యల పరిష్కారంపై దృష్టి

నెల్లూరు :నగరంలోని డ్రెయిన్లు, కాలువల్లో పూడికతీత పనులు, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా తోడివేత పనులు, మురుగు పారుదల చర్యలు, దోమల వ్యాప్తి నిర్మూలన వంటి వివిధ చర్యలపై ప్రత్యేక దష్టి సారించాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 49 వ డివిజన్ గుప్తా పార్క్, యనమల వారి వీధి, రామిరెడ్డి వీధి, జయలలిత నగర్, పాత మున్సిపల్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. స్థానికంగా జరుగుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ పర్యవేక్షించి అధికారులు, సిబ్బందికి వివిధ సూచనలు జారీ చేశారు. నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఇ సంపత్ కుమార్, ఈఈ చంద్రయ్య పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

నెల్లూరు : వెంకటరెడ్డి నగర్, డి యన్ టి కాలనీలోని యంసిపియస్ పాఠశాలలో పిఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పిఎంపి సభ్యుడు కొరకూటి రామ రాఘవయ్య సహకారంతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పెన్నులు, పెన్సిల్స్, రబ్బర్లు, షార్నర్స్, బిస్కెట్స్, చాక్లెట్స్, పండ్లు పంపిణీ అందజేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్రాంత విఆర్‌ఓ దూడల వెంకయ్యతోపాటు 29 వ డివిజన్ కార్పొరేటర్ షేక్ సత్తార్, విశ్రాంత యస్బిఐ సీనియర్ మేనేజర్ మోహన్ రావు మాట్లాడారు. రాంబాబు, రూడ్స్ ఛైర్మన్ షేక్ రసూల్, హాస్పిటల్స్ కోఆర్డినేటర్ కె.వెంకటేశ్వర్లు, పీఎంపీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, జి.శేషయ్య, డి. శ్రీనివాసులు, పి.రామిరెడ్డి, వి.చంద్ర శేఖర్, శాంతి నాయుడు, పాఠశాల హెచ్ యం సర్దార్ పాల్గొన్నారు.

కార్యదర్శులతో ఎంఎల్ఎ సమీక్ష

ప్రజాశక్తి -ఉలవపాడు : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిణి ఎల్.చెంచమ్మ అధ్యక్షతన బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష జరిగింది. ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి పాల్గొన్నారు. పన్ను వసూళ్లు, తదితర అంశాలపై కార్యదర్శులకు సూచనలు చేశారు. విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్, టి.నరసింహం,ఆర్.డబ్ల్యూ. యస్.ఇంజనీరింగ్ అసిస్టెంట్ షేక్.నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

పంటల సస్యరక్షణపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :మండలంలోని పోకూరు, శాఖవరం రైతుభరోసా కేంద్రాల్లో జిల్లా వనరులు (రైతుశిక్షణా కేంద్రం) అధికారులు పంటలపై సమగ్ర సస్యరక్షణపై శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎడిఎ శేషగిరి, జిల్లా వనరుల ఎడిఎ జి లక్ష్మీమాధవి, వ్యవసాయాధికారి పి శ్రీధర్‌రెడ్డి, ఎఒ హేమంత్‌భరత్ కుమార్ పాల్గొని మాట్లాడారు. లక్ష్మీమాధవి మాట్లాడుతూ మినుము పంటలో సస్యరక్షణ చర్యలపై వివరించారు. వ్యవసాయ సహాయకులు వై సుష్మ, కావ్య, భాష, గౌతమి, పోకూరు, బడేవారిపాలెం, నూకవరం, శాఖవరం రైతులు నల్లమోతు చంద్రమౌళి, అత్తోట చెన్నయ్య, వెంకటేశ్వర్లు, వడ్లమూడి నరసయ్య, వడ్లమూడి రమేష్ ఉన్నారు.

మద్యం బాటిల్లుస్వాధీనం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :మండలంలోని పోకూరు గ్రామంలో ఎండ్లూరి చెంచయ్య అనేవ్యక్తి అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్నారని వివిపాలెం ఎస్ఐ బి సుదర్శన్ బుధవారం తెలిపారు. ఆరు మద్యం సీసాలు ఉన్నట్లు గుర్తించి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరుపరిచినట్లు వివరించారు.

గెస్ట్ టీచర్‌కు అవకాశం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో గెస్ట్ టీచర్‌గా పని చేసేందుకు ఒకరికి అవకాశం ఉన్నట్లు ఆ పాఠశాల ప్రత్యేకాధికారిణి జాగర్లమూడి గోవర్ధిని బుధవారం తెలిపారు.6 నుంచి 10 తరగతి వరకు ఫిజిక్స్ సబ్జెక్టును బోధించేందుకు ఉపాధ్యాయుడు అవసరం ఉందన్నారు. పూర్తి వివరాలకు 7702076044 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

కలెక్టర్ ప్రత్యేక పూజలు

కలువాయి : కార్తీక మాసం సందర్భంగా కలెక్టర్ చక్రధర్ బాబు, మండలంలోని పరమానంద స్వామి ఆశ్రమంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. గత ఏడాది సోమశిల వరదల వల్ల నేల కూలి పున నిర్మాణం జరిగిన కట్టడాలను ఆయన పరిశీలించారు. సోమేశ్వర స్వామి, కామాక్షి దేవి అమ్మ వార్ల కు పూజలు చేశారు. పూజారులు ఆలయ మర్యాదలతో కలెక్టర్‌ను సత్కరించారు. అనంతరం కలెక్టర్ సోమశిల జలాశయాన్ని సందర్శించారు. ఆయన వెంట ఎస్ఇ వెంకటరమణ రెడ్డి ఉన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి -కందుకూరు : ఉపాధ్యాయుల బదిలీలను వెంటనే నిర్వహించాలని ఎపిటిఎఫ్ కందుకూరు జోన్ కమిటీ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.ఉపాధ్యాయుల బదిలీలను కౌన్సిలింగ్ ద్వారా వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేసింది. ఎపిటిఎఫ్ కందుకూరు జోన్ కన్వీనర్ ఎస్ డి మునీర్ భాష ,కన్వీనర్లు ఎస్కె ఖాదరభాష, ఏ వెంకటేశ్వర్లు , కె శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ గురునాథ శర్మ ,జిల్లా ఉపాధ్యక్షులు తలారి సుబ్బారావు ప్రకటన విడుదల చేశారు.

వరి పంటకు తెగుళ్ల బెడద

గుడ్లూరు :మండలంలోని మోచర్ల తెట్టు, పంట చెరువు కింద సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. రసం పీల్చే పురుగు వల్ల పైరు రంగు మారి ఎండు ముఖం పట్టిందని వరి సాగురైతులు తెలిపారు. వ్యవసాయ అధికారుల బృందం సభ్యులు బుధవారం పరిశీలించింది. డాక్టర్ యు వినీత పరిశోధనా శాస్త్రవేత్త ,సీనియర్ శాస్త్రవేత్త పి మధుసూధన పాల్గొని రైతులకు అవగాహన కల్పిం చారు. ఎఒ రవికుమార్ సహాయకులు సౌభాగ్యవతి తేజస్వి పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి -కందుకూరు :నలదలపూర్‌కు చెందిన పొన్నగంటి రామయ్య అనే రైతు చదువుకునే విద్యార్థుల అవసరాల నిమిత్తం పొన్నగంటి రంగయ్య, చిన్నమ్మ విద్యారంగ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేవారు. ఆ ట్రస్టు ద్వారా ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న తల్లి లేదా తండ్రి లేని విద్యార్థులకి, కళాశాలలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్న వారికి అవ సరమైన మెటీరియల్‌ను అందజేశారు. బుధవారం పొన్నగంటి రామయ్య చేతుల మీదుగా టిఆర్ఆర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ ,ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు జనరల్ స్టడీస్, జనరల్ నాలెడ్జ్ కి సంబంధించిన మెటీరియల్, ఇంజినీర్; మెడిసిన్ విద్యార్థులకు సుమారు 50 మందికి అవసరమైన మెటీరియల్ అందజేశారు.ట్రస్ట్ కమిటీ సభ్యులు వేణుగోపాల్ రెడ్డి, రిటైర్డ్ తెలుగు పండితులు బైరాగి శాస్త్రి ,ఆర్గనైజరు హనుమంతరావు, కళాశాల అధ్యాపకులు సుబ్బారావు, వెంకటేశ్వరరావు, బాబురావు, శ్రీనివాసులు, మస్తాన్వలి పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి -కందుకూరు : ఈనెల 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన రెండో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ టార్గెట్ బాల్ పోటీలలో కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ జూని యర్ కళాశాల విద్యార్థులు జిల్లా తరపున పాల్గొని రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు.జిల్లాకు, కళాశాలకు మంచి పేరును తీసుకొచ్చారు. వీరిని కళాశాల ప్రిన్సిపల్ కదిరి నాగేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ సుబ్బారావు, అధ్యాపకులు సిహెచ్ బాబురావు, సిహెచ్ రవిబాబు, బీవీ కాశీరత్నం ,అధ్యాపక సిబ్బంది అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి -కందుకూరు :వండలంలోని గనుగుంట గ్రామం వద్ద పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి నలుగురు వ్యక్తులను ఆదుపులోకి తీసుకున్నారు. కందుకూరు రూరల్ ఎస్ఐ శివనాంచారయ్యకు ముందుగా అందిన సమాచారంతో బుధవారం తన సిబ్బందితో దాడి నిర్వహించారు. నాలుగు సెల్ ఫోన్లు, 12 మోటార్ బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీరి వద్ద ఉన్న 48 వేల రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక వేలం

ప్రజాశక్తి -కందుకూరు :మండలంలోని మాచవరంలో అనధికారికంగా ఉన్న ఇసుక డంపును బుధవారం తహాశీల్దార్ డి సీతారామయ్య ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. వేలంపాటలో మొత్తం ముగ్గురు పాటదారులు పాల్గొన్నారు. మాధవరావు అనే వ్యక్తి టన్ను రూ.985లకు అధిక మొత్తం లో పాడి ఇసుక పాటను కైవసం చేసుకున్నారు. మొత్తం 325 టన్నులకు గాను రూ.3,20,125 పాట పాడారు. అనుమతి లేకుండా ఇసుక డంపు ఉండటంతో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని వేలం నిర్వహించడంతో ప్రభుత్వానికి ఈ ఆదాయం వచ్చింది.

గ్రంథాలయ వారోత్సవాలు

ఉలవపాడు :55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమ వారం ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయ ఉద్యమ చరిత్ర - ఉపయోగాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో ఆఉరు పాఠశాలలకు సంబంధించి సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారోత్సవాలకు సహకరి స్తున్న పాఠశాల యాజమాన్యాలకు గ్రంథపాలకుడు డి.కోటేశ్వరరావు కతజ్ఞతలు తెలిపారు.

తక్కువ వడ్డీకి రుణాలు..

గుడ్లూరు :సహకార సొసైటీ పరపతి సంఘం బ్యాంకు ఆధ్వర్యంలో సన్న చిన్న కారు రైతు సోదరులకు తక్కువ వడ్డీకి రుణాలు అందజేస్తామని సొసైటీ సెక్రటరీ గొర్ల కోటేశ్వరరావు తెలిపారు. గుడ్లూరు సహకార సొసైటీ కార్యాలయ ఆవరణంలో రైతుల తోటి అవగాహన సదస్సు బుధవారం జరిగింది. బంగారం, పంట రుణాలు తక్కువ వడ్డీకి అందిస్తామన్నారు.సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రైతుల తోటి కార్యాలయ సిబ్బంది, బుర్రకథ కళా బందం సభ్యులు పాల్గొని రైతులని అలరించారు.

ఒవెల్-14 పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

నెల్లూరు : పొదలకూరు రోడ్లో గల ఓవెల్ 14 నంబర్ స్కూల్లో బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని, ఆ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని నిరసనగా 23 వ డివిజన్ సిపిఎం శాఖ ప్రజా సంఘాలు నిరసన చేపట్టాయి. కార్యక్రమంలో సిపిఎం రూరల్ నాయకులు వీర్ల శ్రీనివాసులు ,సిపిఎం 23వ డివిజన్ కార్యదర్శి ఒంగోలు సుధీర్ ,పార్టీ నాయకులు దిద్దు చిన్నయ్య. కటకాల వెంకటసుబ్బయ్య చెంచయ్య డివైఎఫ్ఐ నాయకులు గోన చైతన్య తరుణ్ బాలు ఉదయ్ కిషోర్ ముని. మహిళా సంఘం నాయకులు అమ్ములు. రిజ్వానా.షఫీన్ పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి : బిఎస్‌పి

ప్రజాశక్తి-నెల్లూరు :చేజర్ల మండలం, పెళ్లేరు పరిసర ప్రాంత గ్రామాల భూ సమస్యల పరి ష్కారంలో అధికారులు, పోలీసుల వైఖరిని నిరసిస్తూ బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానకి ప్రసాద్ జిల్లా అధ్యక్షురాలు కాకుటూరు పుష్పాంజలి మాట్లాడుతూ దళితుల భూములను ఆక్రమించడం దుర్మార్గమన్నారు. 800 ఎకరాల భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. దళితులపై దాడి చేయడం హేయనీ యమన్నారు జిల్లా ఇన్చార్జి బి. శ్రీరామ్ జిల్లా కార్యదర్శి కడింపాటి అశోక్, సీనియర్ నాయకులు పెద్దలు పాలెపు మస్తానయ్య, సర్వేపల్లి నియోజకవర్గ నాయకులు మర్రి రామచంద్రయ్య ఆత్మకూరు దాగూర్ పున్నూరు ఏడుకొండలు కోవూరు నియోజకవర్గ నాయకులు కడింపాటి అనిల్(న్యాయవాది) గాలి రాజా జయరాం రూరల్ నియోజకవర్గ నాయకులు ఇండ్ల శివయ్య జై రావు ఏం బేటి వినయ్ ఎంబేటి నారాయణస్వామి, కర్ర గోపాల్, ఎంబేటి శ్రీనివాసులు ఉన్నారు.

22న కలెక్టరేట్ ఎదుట ధర్నా

నెల్లూరు : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఏ బకా యిలు, సరెండర్ లీవులు వంటి ఆర్థిక పరమైన సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఈ నెల 22న ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యూటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.విచలపతిశర్మ, ప్రధాన కార్యదర్శి వి.వి.శేషులు తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయం చేరుకున్న యూటిఎఫ్ జిల్లా కమిటీ నాయకులు కలెక్టర్ కార్యాలయ అధికారిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. యూటిఎఫ్ సహాధ్యక్షులు ఎంసి అచ్చయ్య, జిల్లా కార్యదర్శి షేక్ ఖాజావలి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

నెల్లూరు : హరినాథపురంలో భవన నిర్మాణ కార్మికుడు సురేష్ కంకర మెటీరియల్ లిఫ్టింగ్ చేసే సమయంలో విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. ఆ కార్మికుడు 30వ డివిజన్ వైఎస్ఆర్ నగర్‌లో నివసిస్తున్నాడు. తోటి భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన సమాచారం తెలుసుకున్న భవన నిర్మాణ కార్మిక సంఘం రూరల్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే ఖలీల్. కొండా ప్రసాద్, సిఐటియు రూరల్ కార్యదర్శి కిన్నెర కుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు.మృతుడి కుటుంబ ఆర్థిక స్థితిగతులు భవన నిర్మాణ యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చి ఆర్థిక సాయం చేయాలని కోరారు. దీనికి స్పందించిన భవన నిర్మాణ యాజమాన్యం రూ. 9 లక్షల విలువ చేసే ఇన్సూరెన్స్ బాండ్, తక్షణ ఆర్థిక సాయంగా రూ. 1,50, 000లు అందజేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఇన్సూరెన్స్ బాండ్, నగదు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆధ్వర్యంలో భవన నిర్మాణ యాజమాన్యం మృతుని సోదరుడు రాజుకు అందజేశారు. మృత దేహాన్ని పోస్టుమార్టం చేసి వాళ్ళ సొంత జిల్లా విజయనగరానికి పంపించే ఏర్పాట్లు చేశారు. సిఐటియు నాయకులు మాలకొండయ్య. పి రత్నం. ఎస్కే బాజావాలి. కోటయ్య ఉన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

నెల్లూరు :రత్నమ్మ చారిటబుల్ సొసైటి పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరు సంతపేట లోని సెయింట్ జోసప్స్ బాలికల ఉన్నత పాఠశాలలో నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవం సందర్భంగా ప్రతిభగల విద్యార్థులకు 'చాచా నెహ్రూ చెకుముకి అవార్డు' ప్రదానోత్సవం నిర్వహించారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్ నుండి వచ్చిన ఎస్.ఆర్.ఆర్.చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఎస్. రామచంద్ర రావు మాట్లాడారు. విజేతలకు అవార్డు ప్రదానం చేశారు. విశ్రాంత ఉపకార్మిక కమిషనర్ రాచపాలెం రఘు, ప్రధానోపాధ్యాయురాలు శౌరీలు సిస్టర్, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. మురళీమోహన్ రాజు పాల్గొన్నారు.

కార్యకర్తలకు మంద కృష్ణమాదిగ పరామర్శ



ప్రజాశక్తి-కావలి : ఎం.ఆర్.పి.ఎస్. వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ బుధవారం కావలికి వచ్చిన సందర్భంగా కావలి పట్టణంలో ఎం.ఎస్.ఎఫ్., ఎం.ఆర్.పి.ఎస్. కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. స్థానిక అరుంధతీయపాలెంలోని చేపూరు మహేష్ కుమార్, ఎంఎస్ఎఫ్ మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ మాజీ రాష్ట్ర నాయకులు నెల్లూరు సోమయ్య ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే అరుంధతీయపాలెంలోని ఎంఆర్పిఎస్ మాజీ నాయకులు చేపూరు మాల్యాద్రి అనారోగ్య కారణాల రీత్యా ఇంటి దగ్గర ఉన్న ఆయనను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మంద వెంకటేశ్వర్లు మాదిగ, గోసుపాటి వెంకటేశ్వర్లు మాదిగ, చేపూరు కిరణ్ కుమార్ మాదిగ, అక్కిలిగుంట ఏసు, శివయ్య, మనోహర్, రామ్మోహన్, సుశీల, జానకి, జిల్లా అధ్యక్షులు పెంచలయ్య, కావలి శీను, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ సర్వేపై అవగాహన



ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని శకునాలపల్లి సచివాలయ సిబ్బంది వాలంటీర్లకు ఆయుష్మాన్‌భారత్ సర్వేపై బుధవారం ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ అవగాహన కల్పించారు. అనంతరం గ్రామసచివాలయంలోని జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను ఇఒపిఆర్డితో కలిసి పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి వాలంటీర్లతో సమావేశం నిర్వహించి ఎబిడిఐ ఆయుష్మాన్‌భారత్ సర్వే వివరాలు తదితర సచివాలయ సేవలపై ఆరాతీశారు. అలాగే చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేసి క్లాప్ మిత్రలకు దిశ నిర్దేశం చేసి పారిశుధ్యం కోసం నిల్వ ఉన్న స్టాక్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇఒపిఆర్డి మల్లికార్జున గ్రామసచివాలయంలో విధులకు హాజరు కాకపోవడాన్ని ఆయన పరిశీలించి వారికి నోటీసులు జారీ చేయమని కార్యదర్శి కరిముల్లాను ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రేపు మహిళా ఆరోగ్య వికాస్

ప్రజాశక్తి-సీతారామపురం : స్థానిక వేదగర్ల ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 19న తేదీన శుక్రవారం మహిళా ఆరోగ్య వికాస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ బొల్లు రామమోహన్ బుధవారం ప్రకటనలో తెలిపారు. చిన్న జీయర్‌స్వామి ఆశీస్సులతో వికాస తరంగిణి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలకు ఆరోగ్య రక్షణ గురించి అవగాహనతో పాటు ఉచిత వైద్య పరీక్షలు చేస్తారన్నారు. మండలంలోని మహిళలందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'అభిరామ్'లో ఇఎన్‌టి వైద్యసేవలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : నెల్లూరు మెడికవర్ హాస్పిటల్‌లో అపార అనుభవం గడించి ప్రస్తుతం ఆత్మకూరు అభిరామ్ హాస్పిటల్లో (చెవి, ముక్కు, గొంతు) సంబంధిత వ్యాధులకు డాక్టర్ వై.చంద్రశేఖర్ వైద్యసేవలు అందించడానికి అందుబాటులో ఉంటారని అభిరామ్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కె.వి.శ్రావణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ అందుబాటులో మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. చెవి నొప్పి, చెవిలో చీము కారుట - వినికిడి లోపం, ముక్కు - కండ పెరుగుట, ముక్కు దూలం వంకరగా ఉండుట, తుమ్ములు అలర్జీ, టాన్సిల్స్ - అడినాయిడ్స్, గొంతు నొప్పి, బొంగురు పోవుట, గురక సమస్యలు, సైనసైటిస్, తలభారం తలనొప్పి, చెవి- ముక్కు, గొంతులో చేప ముళ్ళు, బలపములు, కాయిన్స్ బిళ్లలు ఇరుక్కుపోవడం, నోటి కేన్సర్, మెడలో గడ్డలు, థైరాయిడ్ గడ్డలు పెరిగితే, గ్రంథుల వాపు అత్యాధునిక ఇఎన్‌టి సర్జరీలు ట్యాన్సిలెక్టమీ - అడినాయిడెక్టమీ, సైనసైటిస్ కోసం ఫ్రెస్, మైక్రోలారింగ్, గొంతు సర్జరీ, సెప్టోప్లాస్టి, టింపనోప్లాస్టి, మాస్టాయిడెక్టమీ, చేయబడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు ఉపయోగించుకోవాలని డాక్టర్ శ్రావణ్ కుమార్ తెలియజేశారు. ప్రతి మంగళవారం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అభిరామ్ హాస్పిటల్లో కన్సల్టేషన్ కోసం అందుబాటులో సిబ్బంది ఉంటారన్నారు.

సమస్యల పరిష్కారానికి 'గడపగడపకు'

ప్రజాశక్తి - ఆత్మకూరు అర్బన్ : గ్రామాల్లో అన్ని సమస్యల పరిష్కార దిశగా గడప గడపకు మన ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు కేతా వేణుగోపాల్ రెడ్డి తెలియజేశారు. బుధవారం ఎంపిడిఒ సి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో వెన్నవాడలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం రివ్యూ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ వాలంటీర్లు సమస్యల పరిష్కారంలో సంబంధిత అధికారులను ఈ సమావేశంలో వారి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఎంపిడిఒ ప్రసంగిస్తూ గ్రామంలో 240 సమస్యలు గుర్తించామని వాటిని సంబంధిత అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో వెన్నవాడ, గండ్లవేడు సర్పంచులు జగన్నాథం లక్ష్మయ్య, మమునూరు నరసింహులు, ఎంపిటిసి కె.ప్రమీల, తహశీల్దార్ లక్ష్మి నరసింహులు, అగ్రికల్చర్ అధికారి కిషోర్, ఎ.పి.ఒ.శిరీష, వైసిపి నాయకులు బలరామిరెడ్డి, ప్రసాద్, శ్రీనివాసులు, దొరస్వామి నాయుడు, లింగయ్య, కొండయ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం గొలుసు దుకాణాలపై దాడులు

ప్రజాశక్తి-ఉదయగిరి : అక్రమంగా గొలుసు దుకాణాలపై ఎస్ఇబి అధికారి రవీంద్రబాబు దాడులు నిర్వహించి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. బుధవారం అధికారి రవీంద్రబాబు ప్రకటనలో తెలుపుతూ వరికుంటపాడు మండలం అప్పసముద్రంలో అక్రమంగా గొలుసు దుకాణం నిర్వహిస్తున్నారని ప్రాథమిక సమాచారం మేరకు దాడులు నిర్వహించి 30 మద్యం బాటిళ్లు ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేసిన కేసు ఆయన తెలిపారు. ఆయనవెంట సిబ్బంది పి.రవికిశోర్, ఎం.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అలహరి సుధాకర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కావలి : కావలి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ అలహరి సుధాకర్ జన్మదినం సందర్భంగా బుధవారం జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానులు సమక్షంలో ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 4 రోజులుగా జగనన్న ఇళ్లు- పేదల కన్నీళ్లు కార్యక్రమంలో భాగంగా టిడ్కో ఇళ్ళు జగనన్న కాలనీలు అన్ని సందర్శించి, జగనన్న మోసం అనే పుస్తకంతో విస్తృత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. టిడ్కో ఇళ్ళు కావలి టౌన్, అన్ని మండలాలలో సమగ్ర సంచారం ఎటిటి చేసి సెంటర్ ఆఫీస్‌కు పంపామన్నారు. అదేవిధంగా వైకుంఠపురంలో వరద కారణంగా ఇబ్బంది పడుతున్న వారికి సాంఘిక సంక్షేమ హాస్టల్లో భోజన ఏర్పాట్లు చేశారు. రాబోయే ఎన్నికల కోసం కావలి జనసేన బలోపేతం చేసే విధంగా మా అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కార్యాచరణ రూపొందిస్తున్నారన్నారు. త్వరలో ప్రజలలోకి వెళ్లి విస్తృత స్థాయిలో పార్టీని బలోపేతం చేసే విధంగా కృషి చేస్తామన్నారు. జిల్లా కార్యదర్శి సమ్మెట వెంకట సుబ్బయ్య, పాబ్బా సాయి, మస్తాన్, సుధీర్, రిషిత్, కార్తిక్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ పోటీలలో విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని పాటూరు జెడ్పి హైస్కూల్ నెల్లూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ కేటగిరీకి సంబంధించిన జిల్లా జట్ల ఎంపికలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ జిల్లా ఎంపికలకు షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ భీమవరపు శ్రీనివాసులు తెలిపారు. అందులో భాగంగా షూటింగ్ బాల్ క్రీడపై ఆసక్తి ఉన్న విద్యార్థులు అందరూ పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో పురుషుల జట్టుకు 12 మందిని అమ్మాయిల జట్టుకు 12 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో ఎంపిక కాబడిన క్రీడాకారులందరూ ఈనెల 18,19,20 తేదీలలో కృష్ణాజిల్లా విజయవాడ వికాస్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జరుగు సీనియర్స్ షూటింగ్ బాల్ స్టేట్ మీట్లో పాల్గొంటారని తెలిపారు.

సూపర్‌స్టార్ కృష్ణకు ఘన నివాళులు

ప్రజాశక్తి-కొడవలూరు : తెలుగు వారు మరువలేని నటుడు సూపర్‌స్టార్ కృష్ణ అని ఎంపిటిసి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి కొనియాడారు. మండలంలోని గౌతమ్ నగర్ మజరా శివపురంలో కృష్ణ చిత్ర పటానికి బుధవారం ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ దిగ్గజం కృష్ణ మరణం తనను ఎంతగానో కలచి వేసిందన్నారు. ఆయన మరణంతో తెలుగు సినీ పరిశ్రమ విషాదంలో మునిగిపోయిందన్నారు. కృష్ణ మరణంతో సినీ పరిశ్రమ పెద్ద దిక్కుగా ఉన్న వారందర్నీ కోల్పోవడం జరిగిందని ఆవేదన చెందారు. తెలుగు సినీ పరిశ్రమ నిలబెట్టడంలో కృష్ణ, ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కృష్ణంరాజు, శోభన్‌బాబు లాంటి వారి పాత్ర ఎంతో ఉందన్నారు. తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కృష్ణ ఎంతో సన్నిహితంగా ఉండేవారని తెలిపారు. సినీ పరిశ్రమలో మనస్పర్ధలు లేకుండా గుర్తింపు తెచ్చుకొన్నారని చెప్పారు. తెలుగు సినీ పరిశ్రమలో కృష్ణ ఒక చరిత్ర సృష్టించారని చెప్పారు. డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైసిపి మండల కన్వీనర్ గంధం వెంకట శేషయ్య, కృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు ఎమ్‌కే.శ్రీనుబాబు, సర్పంచ్ నాగిరెడ్డి మహేష్, నాయకులు జనార్దన్, వెంకు బాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ ఆవరణంలో సినీ నటుడు కృష్ణ మృతికి కృష్ణ, మహేష్ బాబు అభిమాన సంఘం నాయకులు సయ్యద్ జమీర్ కృష్ణ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. బుధవారం 7వ వార్డు కౌన్సిలర్ నౌషాద్ బేగం ఆధ్వర్యంలో కృష్ణ చిత్రపటానికి పలువురు ఘన నివాళులర్పించారు. ఆమెవెంట ముస్లిం మైనారిటీ మహిళలు ఉన్నారు.

పలుచోట్ల గ్రంథాలయ వారోత్సవాలు

పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి-మర్రిపాడు

55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడవరోజు బుధవారం గ్రంథాలయంలో ఇన్‌ఛార్జి అధికారి నారాయణరావు పుస్తక ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీబీజాన్ ముఖ్య అతిథిగా పాల్గొని సరస్వతిదేవి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుండి గ్రంథాలయాలను వినియోగించుకొని అభివృద్ధి చెందాలని ఆశించారు. అనంతరం జెడ్‌పి ఉన్నత పాఠశాల, కెజిబివి పాఠశాలల 6,7,8 తరగతుల విద్యార్థులకు చిత్ర లేఖనం, గణితం, ప్రతిభా పరీక్ష, పుస్తక పఠనం ప్రాముఖ్యత, తెలుగు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు 23న బహుమతులు అందజేస్తారన్నారు. గురువారం 9వ తరగతి విద్యార్థులకు ఆంగ్లపఠనం, మిస్సింగ్ లెటర్స్, దిశ చట్టంపై అవగాహన, 10వ తరగతి విద్యార్థులకు మహిళా సాధికారికపై వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కెజిబివి తెలుగు పండిట్ భాగ్యలక్ష్మి, చుంచులూరు రాజుపాలెం బిడిసిఎల్ నిర్వహణ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సంగం : 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బుధవారం సంగం శాఖలో గ్రంథాలయ ఉద్యమ నేతలకు, వ్యవస్థకు మూలకారకులైన వారికి సిఐ రవినాయక్ ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మొదటగా గ్రంథాలయ ఉద్యమ నేతలు గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్, వైసిపి నాయకులు మధుసూదన్ యాదవ్, విశ్రాంతి ఉపాధ్యాయులు రత్నం విద్యార్థులతో పుష్పమాలలతో అలంకరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తకపఠనం అలవరుచుకోవాలని దానివల్ల ఎన్నో ప్రయోజనాలు కలవని ముఖ్యంగా విద్యార్థులు పుస్తక పఠనంతో జ్ఞానవంతులై వారి భవిష్యత్తును మంచి మార్గంలో పెట్టుకోవాలని కోరారు. కార్యక్రమానికి సహకరించిన నేతాజీ జూనియర్ కాలేజీ విద్యార్థులకు వారి యాజమాన్యానికి గ్రంథ పాలకులు రవీంద్రనాథ్‌రెడ్డి ధన్యవాదాలు తెలుపుకున్నారు.

ప్రజాశక్తి-కోవూరు : స్థానిక వైకెఆర్ అండ్ కె గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ ఆధ్వర్యం లో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్స వాల సందర్భంగా క్విజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి పి లక్ష్మీప్రసూన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి పోటీ కార్యక్రమాలలో పాల్గొన్నందు వల్ల ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలలో స్థానం పొందడానికి చక్కగా ఉపయోగించుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రాంప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటినుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే ఎంతో విజ్ఞానం పెంపొందించు కోవచ్చన్నారు. క్విజ్ మాస్టరు డాక్టర్ కె.సుదర్శన్, జడ్జీలుగా డాక్టర్ చుక్కా శ్యామల కుమార్, డాక్టర్ కె.శోభారాణి, గ్రంథాలయ అధికారి డాక్టర్ నరమాల. ప్రభాకర్ తదితరులున్నారు.

నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : డివైఎఫ్ఐ భగత్‌సింగ్ బిట్రగుంట వారి సహకారంతో మండలం లోని నిరుద్యోగులు రాత పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు అందు బాటులో ఉన్నాయని త్వరలో గ్రంథాల యాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా పుస్తకాలు పొందవచ్చని, రాత పరీక్షకు కావాల్సిన పుస్తకాలు కావాల్సిన వారు 9440561804, 9440589359 నెంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు ఉపయోగించు కోవాలని డివైఎఫ్ఐ భగత్‌సింగ్ బిట్రగుంట వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి చల్ల నరహరి, మండల సిపిఎం కార్యదర్శి తుమ్మల వెంకయ్య, జిల్లా మేనేజర్ కే కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలి



తహశీల్దారు మాధవరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-కావలి

రెండు రోజుల క్రితం నాయుడుపేట కూలి పనులకు పోయి తమ స్వగ్రామానికి వెళుతూ తుమ్మలపెంట రోడ్డుపై ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై జరిగిన ప్రమాదంలో చనిపోయిన కొండముది ఆదాము, దగ్గుపల్లి యాకోబులకు, గాయపడిన చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు ఎక్స్‌గ్రేషియో ఇప్పించాలని వ్యవసాయకార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కావలి తహశీల్దారు మాధవరెడ్డికి వ్య.కా.సం. కావలి మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ ఈ దుర్ఘటనలో చనిపోయిన ఆదాము, యాకోబుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.20లక్షలు, గాయపడిన క్షతగాత్రులకు ఒక్కొక్కరికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియో అందజేయాలని డిమాండ్ చేశారు. గాయపడిన వలసకూలీలు కోలుకుని, వారి స్వగ్రామాలకు వెళ్లేందుకు ప్రయాణఏర్పాట్లు, చేసి, వారిని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.సీతారామయ్య, ఎం.రాధాకృష్ణయ్య పాల్గొన్నారు.

జెబిలో రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-కావలి

ప్రతీ విద్యార్థీ తమ బ్లడ్ గ్రూపు తెలుసుకుని ఉండాలని, తద్వారా అవసరాన్ని బట్టి రక్తదానం చేసేందుకు, రక్తసహాయం స్వీకరించేందుకు సులభమవుతుందని విశ్వోదయ విద్యాసంస్థల రెక్టార్ దొడ్ల వినయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జవహర్ భారతి డిగ్రీ కళాశాల ఆవరణలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు విద్యార్థులు ముందుకు రావాలన్నారు. తమ కళాశాలలో పనిచేసిన ప్రముఖ రక్తదాత పెళ్లకూరి గోపికృష్ణ, జాతీయ స్థాయిలో రక్తదాన ప్రేరేపకుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. కళాశాల కరెస్పాండెంట్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విశ్వోదయ వ్యవస్థాపకులు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి రక్తదాతలను ప్రోత్సహించారని, అందువల్లే కావలి రక్తదాతలకు నిలయంగా మారిందని పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ రక్తకేంద్రం సహకారంతో 280 మందికి రక్తగ్రూపు పరీక్షలు నిర్వహించి, గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో జవహర్ భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం నాయుడు, ఎన్ఎస్ఎస్ అధికారులు భాస్కర్ రావు, అయూబ్, రక్తకేంద్రం సిబ్బంది పద్మావతి, శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రీజినల్ పాలిటెక్ సైన్స్‌ఫెస్ట్ ప్రారంభం

తమ ఎగ్జిబిట్స్‌ను గురించి అతిథులకు వివరిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - కావలి

రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో కావలి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం "రీజినల్ పాలిటెక్ ఫెస్ట్2022"ను డిబిఎస్ ఇంజినీరింగ్ కళాశాల అధినేత దామిశెట్టి సుధీర్‌నాయుడు బుధవారం ఘనంగా ప్రారంభించారు. జిల్లాలోని 9 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల నుండి 53 ఎగ్జిబిట్‌లను ప్రదర్శించారు. 8 టెక్నికల్ విభాగాల నుండి 150మంది విద్యార్థులు ఈ ఎగ్జిబిట్‌లను నిర్వహించారు. బుధ, గురువారాల్లో ఈ సైన్సు ఆవిష్కరణల ప్రదర్శనలు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అడపాల సుశీల్‌కుమార్‌ప్రియా తెలిపారు. ఈ ప్రదర్శనల్లో ఎంపికైన ఎగ్జిబిట్‌లకు ప్రథమ (రూ.25,000), ద్వితీయ(రూ.10,000) అందజేస్తామని వివరించారు. కార్యక్రమాలలో ముఖ్యఅతిథులుగా మద్రాసు ఐఐటి ప్రొఫెసర్ డాక్టర్ ఏ.రత్నకుమార్, రామాయపట్నం పోర్టు మేనేజర్ యం.శేషుకుమార్, నెల్లూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ నోడల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.సుధాకరరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్.కె.జీలాని బాషా, రీజియన్‌లోని 9 పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులు, ఆయా సంస్థల విద్యార్థులు, మేధావులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో కలెక్టర్ సందర్శన

మొక్కను నాటుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలం లోని జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా బుధవారం సోమశిలలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు సందర్శించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపిపి సంపూర్ణమ్మ, ఐటిడిఎ పిఒ మందా రాణి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పరిమళ, సోమశిల ప్రాజెక్టు ఎస్ఇ వెంకట రమణారెడ్డి, తహశీల్దార్ రమణ రావు, ఎపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రకాష్ రావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందన సభ

ప్రజాశక్తి-కావలి

స్థానిక విశ్వోదయ బాలుర హైస్కూల్లో బుధవారం కావలి ఉమెన్ ఫోర్స్ ఆధ్వర్యంలో రామ్ సెంటర్ వారు నిర్వహించిన బాలల దినోత్సవ పోటీల విజేతలైన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించినట్లు కన్వీనర్ సి.శారద తెలియజేశారు. డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి (డిఆర్) విశ్వోదయ స్థాపనకు చేసిన కృషిని వివరించి " విద్య ఒక్కటే పేదరికాన్ని రూపుమాపే సాధనమని" విశ్వసించారని తెలిపారు. అదే కావలి కాలేజీ స్థాపనకు కారణమన్నారు. జవహర్ లాల్ మరణానంతరం 1965 నవంబర్ 14వ తేదీ జవహర్ భారతిగా పునర్నామకరణం జరిగిన రోజు "విశ్వోదయ వ్యవస్థాపక దినోత్సవంగా" బాలలంటే చాచా నెహ్రూకు ఇష్టం కనుక "ఆ రోజున బాలల దినోత్సవాన్ని విశ్వోదయ 72 ఏళ్లుగా జరుపుతుందన్నారు. వివిధ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు విజేతలతోపాటు వారిని ప్రోత్సహించేందుకు అభినందన సభను కావలి ఉమెన్ ఫోర్స్ ఏర్పాటు చేసిందని వివరించారు. ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులందుకున్న అందరూ 63 మందికి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ సి.శారద, విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాల పూర్వపు ప్రధానోపాధ్యాయిని, కావలి ఉమెన్‌ఫోర్స్ ప్రెసిడెంట్, మహిళాజర్నలిస్ట్ ఎస్.ప్రభావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ద్వారకనాథ్ చౌదరి బహుమతి ప్రదానం చేశారు. పి.ఇ.టి. శివకుమార్ రెడ్డి, ఫస్ట్ అసిస్టెంట్ జి.కళ్యాణి, సాంస్కృతిక ఇన్‌ఛార్జి సిహెచ్ బ్రహ్మయ్య, ఎన్‌సిసి ఆఫీసర్ ఎస్ కె షరీఫ్, కోటయ్య జగన్నాధం, శ్రీనివాసరెడ్డి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు నివారణ సర్వే పరిశీలన

సర్వేను పరిశీలిస్తున్న వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి-ఉదయగిరి

ఆరోగ్య సిబ్బంది చేపడుతున్న కుష్టు నిమోనియా వ్యాధి సర్వేను గండిపాలెం పి.హెచ్.సి. ఆరోగ్య విద్యా బోధకులు కలసపాటి వెంకట సుబ్బయ్య పరిశీలన చేశారు. బుధవారం పట్టణంలోని దేవలాలగడ్డ, కోళ్ల వీధి, దిలార్ బాయ్ వీధిలో జరుగుతున్న ఎల్.సి.డి.సి కుష్టు వ్యాధి పైసర్వేను పరిశీలించి ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు వారికి కేటాయించిన గృహాలను సందర్శించి రాగి రంగు, స్పర్శ లేని మచ్చలను గుర్తించి వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలన్నారు. ఈ సర్వే 15వ తేదీ నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఆశా కార్యకర్తలు ప్రతిరోజు 30 గృహాలను సందర్శించి ఇంటిలోని ప్రతిఒక్కరిని పరిశీలించి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంట్లో ఐదు సంవత్సరాల చిన్నారులను గుర్తించి వారిలో వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఆశా కార్యకర్తలు పేరు నమోదు చేసుకొని ఆ తల్లికి అమాక్సిన్ ద్రావణాన్ని లేక అమాక్సలిన్ మాత్రలను మింగించే విధంగా చూసి పి.హెచ్.సి, సి.హెచ్.సి. వైద్యాధికారి దగ్గరకు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఎం.ఎల్.హెచ్.పి నాగార్జున, ఆరోగ్య కార్యకర్తలు నూర్జహాన్, జయమ్మ, ఆశా కార్యకర్తలు మహబూబ్ జానీ, రాజుని, నాజున్ను పాల్గొన్నారు.

జెబి అథ్లెటిక్ మీట్

ప్రజాశక్తి-కావలి

స్థానిక జవహర్ భారతి డిగ్రీ కళాశాలలోని దొడ్ల రామచంద్రారెడ్డి క్రీడా ప్రాంగణంలో బుధవారం జవహర్ భారతి డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలల యాన్యువల్ అథ్లెటిక్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవంలో జెబి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలకు, చదువుకి సమాన ప్రాధాన్యతను ఇచ్చే కళాశాల జవహర్ భారతి ఒక్కటే అని, ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులందరూ ఎంతో ఉన్నతిని పొందారని తెలియజేశారు. రెక్టార్ దొడ్ల వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విశ్వోదయ విద్యాసంస్థలు ఎప్పుడు క్రీడలకు పెద్దపీటవేస్తూ, డి.ఆర్. ఆశయాలను కొనసాగిస్తుందని హామీనిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు, జవహర్ భారతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శామ్యూల్ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి : స్థానిక దళితవాడలోని ఎంపిపిఎస్ పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు-నేడు ఫేస్-2 పనులను బుధవారం ఎంఇఒ షేక్ మస్తాన్‌వలీ పరిశీలించారు. జరుగుతున్న ప్రహరీ ఎత్తును పెంచి నిర్మిస్తున్న గోడను నూతన ప్రహరీ నిర్మాణంలో నాణ్యత గల ఇటుకలను ఉపయోగిస్తూ సిమెంటు ఇసుకను తగుపాలలో వేసుకొని నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రహరీని నిర్మించాలన్నారు. హెచ్ఎం ఎస్‌టి హుస్సేన్‌కి, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డికి తెలియజేశారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-బిట్రగుంట : మండలంలోని తెల్లగుంట గ్రామంలో బుధవారం కాంద్ర సతీష్ నాయుడు సహకారంతో పేద కుటుంబాలకు దుపట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ జయంతి బాబు పాల్గొని దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో దళత ఆలిండియా మిషన్ కావలి డివిజన్ కన్వీనర్ కే. సింహాద్రి రావు, గిరిజన జాగృతి వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాపట్ల వెంకటపతి, పిట్ల ప్రత్యూష్, రాష్ట్ర గిరిజన నేత జాయంపు కనకయ్య, గ్రామ పెద్దలు జే.వేణు. నవీన్ కే.బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే రికార్డు సక్రమంగా ఉండాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

జగనన్న భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని నువ్వూరుపాడు గ్రామంలో జరిగిన భూ సర్వే రికార్డులు సక్రమంగా ఉండే విధంగా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి కుర్మానాథ్ తెలియజేశారు. బుధవారం ఆయన నువ్వూరుపాడులో జరిగిన భూ సర్వే రికార్డులను తనిఖీలు నిర్వహించారు. అలాగే సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అన్ని సచివాలయాల్లో అన్ని రికార్డులు ఒకే విధంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మికి సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కరుణ కుమారి, ఎంపిడిఒ సి.శ్రీనివాసులు, తహశీల్దారు లక్ష్మి నరసింహం, సర్వేయర్ శాంతి, పంచాయతీ కార్యదర్శులు కార్తిక్, భాస్కర్, నాయకుడు గడ్డం శ్రీనివాసులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సిపిఎం నాయకురాలు హుస్సేన్‌బీ మృతి

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ఇందుకూరుపేట సిపిఎం శాఖ కార్యదర్శి ఎస్.కె.హుస్సేన్‌బీ మంగళవారం గుండె పోటుతో మరణించారు. ఈ సందర్భంగా ఆమె పార్థివ దేహాన్ని పలువురు సిపిఎం, సిఐటియు నేతలు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుస్సేన్ బీ గత 25 సంవత్సరాల నుండి సిపిఎంలో ఉంటూ నిబద్ధతతో పనిచేస్తూ పార్టీ భావాజాలలతో ఉంటూ ప్రతి ఒక్కరి మన్ననలు పొందారన్నారు. ఆమె హఠాత్ మరణం కుటుంబ సభ్యులతో పాటు పార్టీ శ్రేణుల్లో కూడా తీవ్ర దిగ్భ్రాంతి కలిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా సిఐటియు అధ్యక్షులు టివివి ప్రసాద్, సిపిఎం నేతలు మైపార్టీ కోటేశ్వరరావు, ఎస్‌కె చాన్‌బాషా, బొమ్మ శ్యామ్‌రెడ్డి, మనోహర్, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల వికేంద్రీకరణకు మద్దతుగా ర్యాలీలు

ప్రజాశక్తి -పొదలకూరు : పట్టణంలో బుధవారం మూడు రాజధానులకు మద్దతుగా "వికేంద్రీకరణకే మా మద్దతు" అనే నినాదంతో భారీ ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మూడు రాజధానులతో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. వికేంద్రీకరణతో ప్రాంతాల అభివద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని తెలిపారు. జెడ్‌పిటిసి తెనాలి నిర్మలమ్మ, మండల ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, బచ్చల సురేష్ కుమార్ రెడ్డి, పి. రమణారెడ్డి, కోనం చిన్న బ్రహ్మయ్య, మద్దిరెడ్డి రమణారెడ్డి, మొలబంటి శేఖర్, సోమ భాస్కర్, రావుల దశరథ రామయ్య గౌడ్ పొదలకూరు సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ అభివృద్ధి వికేంద్రీకరణతోనే సాధ్యమవుతుందని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వికేంద్రీకరణకు మద్దతుగా భారీ సంఖ్యలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద నుండి అట్టహాసంగా ప్రారంభమైన ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా మున్సిపల్ బస్టాండ్ వరకు నిర్వహించారు. బస్టాండ్‌కు చేరుకున్న అనంతరం ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి డాక్టర్ బిఆర్ అంబేద్కర్, మాజీముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎంఎల్ఎ ప్రసంగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ డాక్టర్ శ్రావణ్ కుమార్, షేక్ సర్దార్, ఎంపిపి కేతా వేణుగోపాల్‌రెడ్డి, వైసిపి పట్టణ కన్వీనర్ ఆల్లారెడ్డి ఆనందరెడ్డి, సిండికేట్ ఫార్మర్ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్ రెడ్డి, ఇందూరు వెంకటరమణారెడ్డి, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, పెమ్మసాని శ్రీనివాసులు నాయుడు, వల్లభనేని రాజేంద్రనాయుడు, పట్టణ యువత అధ్యక్షుడు వీరప్పరెడ్డి సుదర్శన్ రెడ్డి, కౌన్సిలర్లు, మండలాల ఎంపిపిలు, కన్వీనర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : మూడు రాజధానుల వికేంద్రీకరణకు మద్దతుగా శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గం ప్రచార కార్యదర్శి శాంతికుమారి ర్యాలీ నిర్వహించారు. బుధవారం వైసిపి క్యాంప్ కార్యాలయం నుండి పాత బస్టాండ్ వద్దకు భారీగా నియోజకవర్గ ఎనిమిది మండలాల వైసిపి నాయకులు కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొని మూడు రాజధానులకు మద్దతుగా నినాదాలతో డిజేతో హోరెత్తించి ఉదయగిరిని దద్దరిల్లించారు. మండల కన్వీనర్ అక్కి భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ముత్తుజా హుస్సేన్, ఎంపిటిసిలు తిరుపతయ్య, సుభాన్, మాజీ సర్పంచ్ మూలే సుబ్బారెడ్డి, కల్లూరి కృష్ణారెడ్డి, గోగుల వెంగళరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న మూడు రాజధానులతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు పేర్కొన్నారు. మూడు రాజధానులకు మద్దతుగా ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పిలుపుమేరకు బుధవారం బోగోలు పంచాయతీ కార్యాలయం నుండి సెంటర్లోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పెంచలయ్య, మద్దిబోయిన కీర్తన, మేకల సుజాత, పి.అనిత, రావి వినోద్‌యాదవ్, సుందర్ రాజ్, బండ్ల సురేష్‌గౌడ్, మేకల శ్రీను, నాయబ్‌రసూల్, గండూరి శ్రీను, సాల్మన్‌రాజ్, షమీవుల్లా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Summons under Order V Rule 1 & 5
In the court of the Senior Civil Judge :: Kandukur
O.S.No. 56 / 2019

Chunduri Padma - Plaintiff
Vs
Navuluri Anjaiah & Others - Defendants

To,
D3) **Gattamaneni Suseela,** Wife of **Hari Babu,** Pokuru Village, Voletivaripalem Mandal, Erstwhile Prakasam District. Present SPSR Nellore District.
D5) **Tanikonda Tirupathamma,** Wife of **Venkateswarlu,** Singamneni Palli Village, Voletivaripalem Mandal, Erstwhile Prakasam District. Present SPSR Nellore District.

Whereas the above plaintiff has instituted the above number suit against you for deceree, you are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit (or who shall be accompanied by some persons able to answer all such quetions) **on 18-11-2022** at **10:30 AM,** and to state whether you contest or do not contest the claim and if you contest, to receive directions of the court has to the date on which you have to file written statement, the date of trail and other matters. Take notice that in the event of the claim not being contested the suit shall be decided at once. Take further notice that in default of your appearance on the day and hour before mentioned the suit will be heard and determined in your absence.

T. Gopal Krishna Murthy
Advocate for Plaintiff
Kandukur

ఒంగోలు 8వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఇ.పి. నెం.531/2019
ఇన్
ఓ.యస్.నెం : 169/2013
తోగంటి శ్రీనివాసులు .... వాది/D.H.R
మరియు
దామ మహేంద్ర మరియు ఇతరులు
... ప్రతివాదులు/JDr's

To
JDR-1
దామ మహేంద్ర, తండ్రి : సుబ్బయ్య
అడ్రసు : విక్కిరాల పేటరోడ్, కందుకూరు టౌన్ మరియు యస్.పి.యస్.ఆర్ నెల్లూరు జిల్లా
JDR-2
షేక్ కాలేషా, తండ్రి : అల్లాభక్షు
అడ్రసు : 11 వవార్డు, సంతోష్‌నగర్, కందుకూరు టౌన్ మరియు యస్.పి.యస్.ఆర్ నెల్లూరు జిల్లా
JDR-3
షేక్ లాల్ అహ్మద్, తండ్రి : కాలేషా
అడ్రసు : 11 వవార్డు, సంతోష్‌నగర్, కందుకూరు టౌన్ మరియు యస్.పి.యస్.ఆర్ నెల్లూరు జిల్లా
JDR-4
షేక్ అల్లాభక్షు , తండ్రి : కాలేషా
అడ్రసు : 11 వవార్డు, సంతోష్‌నగర్, కందుకూరు టౌన్ మరియు యస్.పి.యస్.ఆర్ నెల్లూరు జిల్లా

పై నెంబరు ఇ.పి.531/2019లో రెస్పాండెంట్స్/JDr's అను మీకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పై నెంబరు ఇ.పి.531/2019 లో మీ హాజరు నిమిత్తం తేది : 01-12-2022 న వాయిదా కలదు. కనుక ఆరోజు అనగా ఉదయం 10.30 లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కాని, లాయరు గారి ద్వారా కాని హాజరై సంజాయిషీ తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయుదురు.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
పెండ్యాల శివహరి
మద్దాలి నాగరాజు
న్యాయవాదులు, ఒంగోలు